


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 06-01-2024 సంపుటి : 06 సంచిక : 118 పేజీలు : 8 వెల : రూ 3-00

# అమలైన వివిధ సంక్షేమ పథకాలు

**అందని 68,990 మంది అర్హులకు**
**రూ.97.76 కోట్లు జమ చేసిన సీఎం జగన్**



తాడేపల్లి జనవరి 5 ( విభారె) ఏ పేదవాడు సంక్షేమ పథకాలు అందకుండా ఉండొద్దనేదే ప్రభుత్వ లక్ష్యం సీఎం జగన్ గత 55 నెలల్లో డీబీటీ ద్వారా రూ.2,46,551 కోట్లు అందించాము ఇంత బాధ్యతగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రభుత్వం జవాబుదారీతనానికి సంకేతం ఏ పేదవాడు సంక్షేమ పథకాలు అందకుండా ఉండొద్దనేదే ప్రభుత్వ లక్ష్యం.అర్హతే ప్రామాణికంగా అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశమిస్తూ ఇంత బాధ్యతగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎంతో సంతోషాన్నిస్తోంద?. జనవరి?జూన్ మధ్య అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణంతోనైనా మిగిలిపోయిన వారికి జూన్?జూలైలోను అలాగే జూలై నుంచి డిసెంబర్ వరకు మిగిలిపోయిన వారికి డిసెంబర్?జనవరిలో సాయం అందిస్తున్నాం అని సీఎం జగన్ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గత ఆగస్టు 2023 నుండి డిసెంబర్ 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలు అందని 68,990 మంది అర్హులకు రూ.97.76 కోట్లను సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేశారు.ఈ సందర్భంగా సీఎం జగన్ వర్చువల్‌గా మాట్లాడారు.నా దగ్గర నుంచి మొదలు పెడితే కలెక్టర్లు కింది స్థాయిలో సచివాలయం వరకు ప్రతి ఒక్కరికీ ఇదొక పెద్ద సంతృప్తినిచ్చే కార్యక్రమం ఇదని సీఎం జగన్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ పథకం ప్రతి 6 నెలలకోసారి క్రమం తప్పకుండా జూన్-జూలైలో ఒకసారి మళ్లీ డిసెంబర్-జనవరిలో మరోసారి ఇలా 6 నెలలకు సంబంధించిన పథకాల్లో అర్హత ఉండి కూడా పొరపాటున ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి తోడుగా నిలుస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

# కరోనా డేంజర్ బెల్స్..

**గడిచిన 24 గంటల్లో**
**12 మంది మృతి**



ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ మరోసారి భారత్‌లో చాప కింద నీరులా విస్తరిస్తోంది. రోజురోజుకీ పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. మరోవైపు మహమ్మారి బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది.గడిచిన 24 గంటల్లో 761 మంది కరోనా బారిన పడ్డారు. ఒక్క రోజులోనే 12 మంది మృత్యువాతపడ్డారు. ఈ మేరకు కేంద్ర వైద్యారోగ్యశాఖ శుక్రవారం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4,423కి చేరింది.అత్యధికంగా కేరళలో 1,249 యాక్టివ్ కేసులు ఉండగా కర్ణాటక 1,240, మహారాష్ట్ర 914, తమిళనాడు 190, చత్తీస్‌గఢ్- ఆంధ్రప్రదేశ్‌లో 128 చొప్పున యాక్టివ్ కేసులు ఉన్నాయి. కోవిడ్‌తో మరణించిన వారిలో కేరళలో అయిదుగురు, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కరు ఉన్నారు.కాగా గతేడాది తగ్గుముఖం పట్టిందనుకున్న కరోనా డిసెంబర్ నుంచి పెరుగుతూ వస్తోంది. డిసెంబర్ 5 వరకు వందలోపు నమోదైన కేసులు.. తర్వాత కొత్త వేరియంట్ వెలుగుచూడంతో ఒక్కసారిగా పెరిగిపోయాయి. 2020లో కరోనా తొలిసారి బయటపడినప్పటి నుంచి ఇప్పటివరకు 4.5 కోట్ల మంది కరోనా బారిన పడగా.. 5.3లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 4.4 కోట్ల మంది మహమ్మారి నుంచి కోలుకున్నారు. దేశంలో రికవరీ రేటు 98.81 శాతంగా ఉంది. ఇక 220.67 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశారు.

# వంద ఎకరాల్లో తెలంగాణ కొత్త హైకోర్టు.. జీవో జారీ..



హైదరాబాద్, : తెలంగాణలో నిర్మించబోయే కొత్త హైకోర్టు కోసం 100 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ సర్కార్ జీవో జారీ చేసింది.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ప్రేమావతి పేట్ , బుద్వేల్ గ్రామం పరిధిలో ఉన్న 100 ఎకరాలను హైకోర్టు ప్రాంగణం కోసం కేటాయిస్తున్నట్లు జీవో నెంబర్ 55లో పేర్కొంది.కిందటి నెలలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, పలువురు హైకోర్టు న్యాయమూ ర్తులు ఎంసీహెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో.. కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కొత్త హైకోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది.కొత్త భవనం నిర్మాణం జరిగే వరకు హైకోర్టు కార్యకలాపాలు పాత భవనంలోనే జరుగుతాయి. ఆ తర్వాత హెరిటేజ్ భవనంగా పరిరక్షించాలని సర్కార్ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న భవనాన్ని సిటీ కోర్టుకు లేదంటే మరేదైనా కోర్టు భవనానికి వాడుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే చీఫ్‌సెక్రటరీ శాంతికుమారిని ఆదేశించారు.

# అమరావతిలో ఆర్-5 జోన్ వ్యవహారం

**విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసిన సుప్రీం**
**అత్యవసర విచారణను తిరస్కరించిన ధర్మాసనం**



న్యూఢిల్లీ,జనవరి5 ( విభారె) అమరావతిలో ఆర్-5 జోన్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. వెంటనే విచారణ జరపాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనానికి రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విజ్ఞప్తి చేశారు. అయితే రాజధానికి సంబంధించిన ప్రధాన పిటిషన్ ఇదేనని, ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉందని రైతుల తరపు న్యాయవాది దేవదత్ కామత్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమయంలో ఏపీ ప్రభుత్వం పేదలకు సెంటు భూమి ఇచ్చి నివాస గృహాలు.. నిర్మించేందుకు చేసిన ప్రయత్నాలు అడ్డుకున్నారని సింఘ్వీ వాదించారు. ఏం జరుగుతుందో తమకు అన్నీ తెలుసన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా సింఘ్వీ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. ఏప్రిల్‌లో నాన్ మిస్లేనియస్ డే రోజు విచారణ జరుపుతామని తెలిపి వాయిదా వేసింది. అందరికీ ఇళ్లు పథకం కింద అందుబాటులో ఉండే ధరలతో వాటి నిర్మాణాలు చేపట్టడానికి వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్ 5 పేరుతో జోన్ ఏర్పాటు చేసింది. అమరావతిలో పరిధిలో కూడా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను ఇవ్వడానికి ఆర్ 5 జోన్‌ను నోటిఫై చేసింది. తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు, మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు గ్రామాల పరిధిలో నిర్మించాలని నిర్ణయించారు. దీనిపై రాజధాని ప్రాంత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాన్ని నిలువరించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హరిలతో కూడిన హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపైనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. మూడు రోజుల కిందట ఏపీ రాజధాని అమరావతి కేసు సుప్రీంలో ఏప్రిల్‌కు వాయిదా పడింది.

# రాజ్యసభకు ఆప్ అభ్యర్థిగా స్వాతి మలివాల్

**మహిళా కమిషన్‌కు రాజీనామాతో ఉద్యోగుల భావోద్వేగం**



న్యూఢిల్లీ,జనవరి5 : ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎన్నికలకు నామినేట్ చేసింది. శుక్రవారం జనవరి 19న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆమె తన పదవికి రాజీనామా చేసింది. ఈ క్రమంలో తన కార్యాలయంలో రాజీనామా లేఖపై సంతకం చేసి ఆమె వెళుతున్న క్రమంలో అక్కడి సిబ్బంది ఉద్వేగానికి లోనయ్యారు. ఆమెను పలువురు మహిళలు హత్తుకుని కన్నీరు పెట్టుకున్నారు. అంతేకాదు ఇంకొంత మంది స్వాతి వెళుతున్న క్రమంలో చప్పట్లు కొడుతూ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా జరుగుతాయని చెప్పవచ్చు. అయితే స్వాతి మలివాల్ చిన్న వయస్సులోనే ఢిల్లీ మహిళా కమిషన్(ఆఅచి) ఛీఫ్‌గా పదవి భాధ్యతలు స్వీకరించి ఎన్నో సవాళ్లను స్వీకరించింది. దీంతోపాటు అనేక సార్లు ఆమె మహిళల హక్కులు, సామాజిక సమస్యల పట్ల చురుకుగా వ్యవహరించింది. ఇంకొన్ని సార్లు మహిళలపై హింసను ఎదుర్కోవడం సహా కఠినమైన చట్టాలు, లింగ సమానత్వం వంటి అంశాల గురించి స్వాతి ధైర్యంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో ఆమెకు అనేక మంది మహిళలతోపాటు యువకులు కూడా స్వాతి చేస్తున్న అనేక కార్యక్రమాలకు మద్దతు ఇచ్చారు. దీంతో ఆమె పెద్ద ఎత్తున అభిమానులను సంపాదించుకున్నారు.

# రాష్ట్రంలో బ్రిటిష్ పాలన సాగుతోంది : కన్నా


పల్నాడు,జనవరి5 :ప్రజలు వ్యతిరేకించిన వైసీపీ ఎమ్మెల్యేలు మరోచోట పోటీ చేస్తే ఎలా గెలుస్తారని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో బ్రిటీష్ పాలన చేస్తూ, సీఎం జగన్ దోపిడీకి తెరలేపారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందన్నారు. సత్తెనపల్లి ఆదినారాయణ వైసీపీ ఎజెంట్‌గా పని చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజి చౌదరిపై కేసు ఎత్తి వేయాలని చెప్పారు. వైసీపీ పార్టీ పై 100శాతం వ్యతిరేకత ఉందన్నారు. జగన్ ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదని చెప్పారు.. జగన్ రోడ్డుపై తిరగలేక హెలికాప్టర్‌లో తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలు స్థానం మార్చితే గెలవలేరని కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు.



# స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 జాతీయ అవార్డులలో మరోసారి సత్తాచాటిన ఆంధ్ర ప్రదేశ్

**స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఎండి గంధం చంద్రుడు**

విజయవాడ జనవరి 5 ( విభారె) స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 జాతీయ స్థాయి పురస్కారాలలో పలు అవార్డుల కైవసం చేసుకోవటం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ మరోసారి సత్తాచాటిందని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఎండి గంధం చంద్రుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించే అతి పెద్ద పారిశుద్ధ్య సర్వేలో దేశంలోనే అత్యుత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ విజయవాడ తిరుపతి గుంటూరు నగర పాలక సంస్థలు 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కించుకున్నాయన్నారు. పులివెందుల పురపాలక సంఘం రాష్ట్ర స్థాయిలో అవార్డు కైవసం చేసుకుందన్నారు.విజయవాడ నగర పాలక సంస్థ 2021, 2022, 2023 సంవత్సరాలలో వరుసగా ఇండియా క్లీనెస్ట్ సిటీ, క్లీన్ స్టేట్ క్యాపిటల్, జాతీయ అవార్డు అవార్డులను పొందిందన్నారు. విశాఖ నగరం 2021 నుండి 2023 వరకు వరుసగా బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్లీన్ బిగ్ సిటీ, జాతీయ అవార్డు సాధించిందన్నారు. తిరుపతి నగరం బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ (2021)సఫాయిమిత్రసురక్షిత్‌ప్రెసిడెంట్ అవార్డు (2022), జాతీయ అవార్డు (2023)దక్కించుకుందన్నారు. పుంగనూరు పురపాలక సంఘం 2021,2022సంవత్సరాలలో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్‌అవార్డులనుపులివెందుల2022 సంత్సరంలో ఇన్నోవేషన్ బెస్ట్ ప్రాక్టీస్‌అవార్డును2023లోస్టేట్ అవార్డులను దక్కించుకున్నాయన్నారు.ఈ సందర్భంగా రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి మంచి ఫలితాల దిశగా పునరంకితం అవుతామని తెలిపారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మార్గనిర్దేకత్వ, విప్లవాత్మక నిర్ణయాల వల్లే అవార్డులు గత మూడేళ్లలో మంచి ఫలితాలు సాధించగలిగామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కు జాతీయస్తాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడమే ఇందుకు నిదర్శనమని గంధం చంద్రుడు స్పష్టం చేసారు. పారిశుద్ధ్య నిర్వహణలో పట్టణాభివృద్ధి శాఖ అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నదని ముఖ్యమంత్రి సైతం ప్రశంసించారని, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అందిస్తున్న సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి నిరంతర పర్యవేక్షణ సమీక్షలు మార్గదర్శకత్వం అవార్డుల సాధనకు ఎంతో ఉపకరించాయన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ అవశ్యకతను నొక్కి చెబుతూ ప్రణాళికాబద్దంగా పనిచేసేలా స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ను ప్రోత్సహిస్తూ వచ్చారని గంధం చంద్రుడు తెలిపారు.పురపాలక శాఖ కమీషనర్ కోటేశ్వరరావు, సిఎంఓ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ పట్ల నిరంతరం సలహాలు ఇస్తూ రావటం వల్లే ఇన్ని సంవత్సరాలుగా ఈ ఘనతను దక్కించుకున్నామన్నారు.



# విశాఖ వేదికగా పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్ మేళా

**సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి**
**డిప్లొమా ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు జనవరి 8, 9 తేదీల్లో ఉద్యోగ మేళా**
**అంతర్జాతీయ సంస్థ సుజ్లాన్ గ్లోబల్ సర్వీసెస్ లో అవకాశాలు**



విజయవాడ జనవరి 5( విభారె) డిప్లొమా మెకానికల్ ఎలక్ట్రికల్ విభాగాలలో 2022, 2023 సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు 1 నుండి 3 సంవత్సరాల అనుభవం కలిగియున్న అభ్యర్థుల కోసం విశాఖ వేదికగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు.పునరుత్పాదక ఇంధన పరిష్కారాల ప్రొవైడర్ గా ఉన్న సుజ్లాన్ గ్లోబల్ సర్వీసెస్ ద్వారా దేశవ్యాప్తంగా డిప్లొమా ఇంజనీర్ ట్రైనీ అవకాశాల కోసం ఉద్యోగ మేళా నిర్వహించటం జరగనుందన్నారు. జనవరి 8, 9 తేదీలలో విశాఖపట్నంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్‌లో దీనిని నిర్వహిస్తున్నామని నాగరాణి తెలిపారు.వేగంగా విస్తరిస్తున్న పునరుత్పాదక ఇంధన రంగంలో ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు అంది పుచ్చుకునేలా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం సాంకేతిక విద్యా శాఖ ట్రైనింగ్ ప్లేసెమెంట్ విభాగం అధికారులను 7382082692 విశాఖపట్నం గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ సిబ్బందిని 7382463845 నెంబర్ లలో సంప్రదించవచ్చని చదలవాడ నాగరాణి వివరించారు.

# సంపాదకీయం

శనివారం 06-01-2024

## బిఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు !

ఎన్నికల్లో ఓటమిని బీఆర్ఎస్ అంగీకరించలేకపోతోందని ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలతో అర్థం అవుతోంది. నెలరోజులు తిరక్కుండానే కాంగ్రెస్‌ను 420 అంటూ బుక్‌లెట్ విడుదల చేయడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనంగా చూడాలి. దాదాపు పదేళ్లపాటు అహంకారంతో కూడిన అధికారం చెలాయించి..తెలంగాణను అప్పులకుప్పగా తయారు చేసిన కెసిఆర్, ఆయన కుటుంబం ఇప్పుడు, అప్రజా స్వామికంగా మాట్లాడుతోంది. అధికారం పోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ప్రేలాపనలు చేస్తోంది. దళిత సిఎం వంటి హామీ మొదలు అనేక హామీలను అమలు చేయకుండా, తెలంగాణ అమరుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణను దోచుకున్నది చాలక ఇప్పుడు ..కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే బురదజల్లే మైండ్‌గేమ్ ఆడుతోంది. ఎక్కడ తమ అవినీతిని తవ్వి తీస్తారోనన్న భయం బిఆర్ఎస్ నేతలను వెన్నాడుతోంది. అందుకే నిద్ర పోవడం లేదు. వెంటనే హామీలు అమలు చేయడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదేమో. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఓట్లు పడాలంటే ఇలాంటి ఎత్తుగడలు వేయాలని అనుకుంటున్నారేమో...ఇంకా అధికార మత్తు వీడకపోవడం వల్ల..తమకు అధికారం లేదన్న నిజాన్ని గుర్తించకుండా చేస్తున్న విపరీత వ్యాఖ్యలు తప్ప మరోటి కాదు. వారి మాటలు వింటున్న వారికి వెగటు పుట్టించడమే గాకుండా..ప్రజల్లో ఛీత్కరించుకునే పరిస్థితి రాబోతోంది. ప్రజలు పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేశారని, తమను ఓడించి తప్పు చేశామని బాధపడుతున్నారని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖలు ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ముఖ్యంగా కెటిఆర్ తదితరులు ఇలా అనుకుంటున్న తీరును రిదిద్దుకుంటే మంచిది. నిజానికి ప్రజలు సరిగ్గానే ఓటేశారు. కెసిఆర్ అహంకార పూరిత అధికారాన్ని తట్టుకోలేకనే దించేశారు. దీనికి లెక్కలు కట్టాల్సిన పనిలేదు. తమకు , కాంగ్రెస్ పార్టీకి కేవలం రెండు శాతం ఓట్ల తేడానేనని లెక్కలేయడం మానేస్తే మంచిది. గోబెల్స్ ప్రచారాలతో ప్రజలను మభ్య పెట్టిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ముమ్మాటికీ బిఆర్ఎస్ అని చెప్పక తప్పదు. 32 మెడికల్ కాలేజీలకు బదులు 32 యూట్యూబ్ చానళ్లు పెట్టుకోవాల్సిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన ఫ్రస్టేషన్‌ను నిరూపిస్తోంది. అధికారమనే పొర కమ్మడంతో ప్రజలు కనిపించక పాలన చేశారు. ప్రజాభవన్ వద్దకు వెళితే ప్రజలు ఎలాంటి సమస్యలతో వస్తున్నారో కనిపిస్తుంది. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ పేర్లతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించి, బలవంతంగా రైతుల భూములు గుంజుకుని, తమ ఫామ్‌హౌజ్ భూములకు మాత్రం కంచెలు వేసుకుని నిరంకుశంగా పోలీసులతో లాఠీ దెబ్బలు తినిపించి, ప్రజలను, రైతులను జైళ్లకు పంపి, ఊచలు లెక్కబెట్టించిన ఘనులు బిఆర్ఎస్ పాలకులు. ఇవన్నీ కాదనలేని సత్యాలు. నిరంకుశ పాలనను తారాస్థాయికి తీసుకుని వెళ్లిన విషయం మరచిపోయి...ఇప్పుడు నంగనాచి మాటలు మాట్లాడితే ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. మొత్తంగా కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ హైకమాండ్ తీరు తప్పుల్ని దిద్దుకునేలా కనిపించడం లేదు. ఎందుకు ప్రజలు తమను దూరం పెట్టారో కారణాలను విశ్లేషించడం లేదు. లోతుగా విశ్లేషిస్తే గ్రేటర్‌లో తప్ప.. మిగిలిన ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఏకంగా పది శాతానికిపైగా ఓట్ల తేడాతో వెనుకబడిందని ఫలితాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రెండు కంటే తక్కువ శాతం ఓట్ల తేడా ఉందని ఆ మార్పు రావడానికి ఎంతో కాలం పట్టదని బీఆర్ఎస్ నేతలు సర్దిచెప్పుకుంటే సరిపోదు. తప్పులు సరిదిద్దుకుందామన్నా ఇప్పుడు అవకాశం లేదు. కాళేశ్వరం పాపం బద్దలు కాబోతున్నది. సింగరేణి పాపం కూడా బద్దలు కాబోతున్నది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపకం, దళితబందు..ఇలా అన్ని స్కీమ్‌ల వెనక పెద్దపెద్ద స్కాములు ఉన్నాయని అంటున్నారు. ఇవన్నీ గమనించే కేటీఆర్ పదేపదే ఈ రెండుశాతం తేడా ఓట్ల సిద్ధాంతాన్ని చెబుతున్నారు. ప్రజలు తప్పు చేశారన్నట్లుగా మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. గెలిచిన పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారిస్తాయి. వాళ్లకు అవకాశం ఇచ్చిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి చేస్తాయి. కానీ తెలంగాణలో మాత్రం భిన్నపరిస్థితులు నెలకొన్నాయి. బీఆరెస్ ఇప్పటికీ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నది. ప్రజలకు తాము ఎంతో చేసినా మమ్మల్ని ఆదరించలేదని వాపోతున్నది. వాస్తవాలను విస్మరించడం వల్లనే ప్రజలు తమకు బుద్ధి చెప్పారని అంగీకరించే సంస్కారం బిఆర్ఎస్ నేతలకు లేకుండా పోయింది. వాస్తవాన్ని గత పాలకులు ఇప్పటికీ అంగీకరి ంచడం లేదన్నది అర్థం అయ్యింది. అందుకే నెలరోజులు కూడా కానీ కొత్త ప్రభుత్వాన్ని ఎలా బద్‌నామ్ చేయాలా అని ఆలోచన చేస్తున్నారు. ఓ వైపు బిజెపి, మరోవైపు బిఆర్ఎస్ ఇదే పనిలో ఉన్నాయి. తెలంగాణలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశామని అయినా ప్రజలు ఓడగొట్టారని .. వాళ్లకు మంచి చేయకుండా యూట్యూబ్ చానళ్లు పెట్టుకున్నా గెలిచేసేవా రమని కేటీఆర్ నిట్టూర్పులు విడుస్తున్నారు. కేటీఆర్ తీరు చూస్తూంటే అధికారం లేకపోవడంతో ఉండలేకపోతున్నారని అర్థం అవుతోంది. ప్రజల తీర్పును జీర్ణించుకోలేకపోతున్నారని ప్రజలు కూడా నిట్టూరుస్తున్నారు. చేసిన తప్పులను ఒప్పుకుని, మరోసారి కష్టపడి ప్రజల మనసుల్ని గెలుచుకనే ప్రయత్నం చేస్తేనే బిఆర్ఎస్‌కు మనుగడ ఉంటుంది. ఇలాగే పిచ్చిపిచ్చిగా వాగితే మాత్రం ప్రజలు కర్రుకాల్చి వాతలు పెట్టడం ఖాయం. ప్రజల నాడిని పసిగట్టి ఆత్మపరిశీలన చేసుకుని పాలనను ప్రజలకు చేరువ చేయడంలో బిఆర్ఎస్ పూర్తిగా విఫలం అయ్యింది. ప్రజలంటే లెక్కలేకుండా వ్యవహరించింది చాలక... సిఎం అన్నవాడు ప్రజలను కలవాల్సిన అవసరం ఏముందని వాదించిన మూర్ఖులు...ప్రజల ఓట్లు ఎందుకు కావాలో చెప్పలేదు. ప్రజలు కూడా తమకు అవసరం లేని, తమను కలవని సిఎం వద్దను కున్నారేమో.. అందుకే ఓడించారేమో.. వీరు ఇలాగే మాట్లాడితే..ఇలాగే లెక్కలు వేస్తే..వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరింత భంగపాటు తప్పదని గుర్తించాలి. అందుకే మంత్రి సీతక్క ఓ మాట అన్నారు...తమది గడీల పాలన కాదని..గరీబు బిడ్డల పాలన అని..!

# మున్సిపల్ కార్మికుల సమ్మెను ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించాలి...







విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 5 సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మె లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల దీక్షా శిబిరంలో 11 రోజు శుక్రవారం సమ్మె కొనసాగింది.మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలు పెడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరి పట్ల వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల దీక్షా శిబిరం నుండి కూరగాయల మార్కెట్, కంబాలపాడు సర్కిల్,పాత బస్టాండ్ మీదుగా గాంధీ చౌక్ చేరుకొని గాంధీ విగ్రహం ఎదుట పొర్లు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు.అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్,మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.రామాంజనేయులు,ఏవి. భాస్కర్ రెడ్డి,కోశాధికారి నాగమద్దయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయిలకొండ నాగరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన హామీలను చివరి సంవత్సరం లోనైనా ప్రభుత్వం అమలు చేస్తుందని,కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తుందని లేదా సమాన పనికి సమాన వేతనం అయినా ప్రకటిస్తుందని కార్మికులు ఎదురుచూశారని అయితే కార్మికుల ఆశలను ఈ ప్రభుత్వం అడియాశలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 2024 ఎన్నికలకు ముందు అయినా అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని సమస్యల పరిష్కారం కొరకు గత నాలుగున్నర సంవత్సరాలుగా అనేక రకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.కావున గత్యంతరం లేని పరిస్థితులలో నిరవదిక సమ్మెకు పిలుపునిచ్చింది అన్నారు.కరోనా సమయంలో కూడా మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి ప్రజల కోసం పనిచేశారన్నారు.అయినా వారికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నందున నిరవధిక సమ్మె తప్పడం లేదన్నారు.సమ్మె వల్ల ప్రజలకు కలిగే అసౌకర్యాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని ప్రజలు కూడా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న సమ్మెను సహృదయంతో అర్థం చేసుకొని మున్సిపల్ కార్మికులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కుళ్లాయప్ప,పెద్ద ఎల్లయ్య,గోవిందు,దేవదానం,ఏసు ,ఆవులయ్య,హైమారావు,రామాంజి,వెంకటలక్ష్మమ్మ, రంగనాయకులమ్మ,అంజనమ్మ లలితమ్మ,సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అడవులు కాలిపోకుండా రక్షించుకోవడం మనందరి బాధ్యత

వెంగళమ్మ చెరువు విద్యార్థులతో
పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు
పుష్కలమైన ప్రకృతి ద్వారానే సమాజం
శక్తివంతమవుతుంది



పుట్టపర్తి జనవరి 05 శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణవిశిష్టత అన్న అంశంపై అవగాహనసదస్సు నిర్వహించారు ప్రకృతి పుష్కలంగా ఉంటే ఆహారం ఆక్సిజన్ నీరు భూమి వాతావరణం సమపాళ్లలో కొరత లేకుండా ఉంటే ఆ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందని. ఇందులో భాగంగా విద్యార్థుల బాధ్యతలు, వారిభవిష్యత్తు, సమాజాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి, శక్తివంతంగా ఎలాఉండాలి, జ్ఞానవంతంగా ఎలాఉండాలి, ప్రకృతిని ఎలా కాపాడుకోవాలి, ప్రకృతి అంటే ఏమిటి. అన్న విషయాలపై,పూర్తి సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా కొనసాగింది. పాఠశాల హెడ్మాస్టర్ మాట్లాడుతూ ఏ విద్యార్థి అయినా ఉత్తమంగా రాణించాలంటే, ప్రకృతి ద్వారా అధిక మొత్తంలో ఆక్సిజన్ తీసుకొని శక్తివంతం కావాలి. ప్రకృతితో ఉండాలి, ప్రకృతిని పరిరక్షించాలి, అప్పుడే ఎగ్జామ్స్ లోగాని, ఇంటర్వ్యూస్ లోగాని, ఉత్తీర్ణత సాధించగలరని తన అనుభవాలను సైతం తెలియజేశారు. ఈ సందర్భంగా,విశిష్టమైన జ్ఞానాన్ని తెలియజేసినందుకు, డాక్టర్ భాస్కర్ నాయుడుకివారు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు సైతం ప్రకృతిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు పిఈటి రామ కృష్ణ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మవరాన్ని సమస్యలకు నిలయంగా మార్చేశారు

ఏ కాలనీలో చూసిన ప్రజల కష్టాలు కనిపిస్తున్నాయి
మైనార్టీలకు రక్షణగా ఉండేది తెలుగుదేశం పార్టీ మాత్రమే
రెండవ రోజు పాదయాత్రలో పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలు
5వ వార్డులో టిడిపిలో చేరిన వైసీపీకి చెందిన యువకులు
పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి పరిటాల సునీత
కార్యకర్తలు గాలి మాటలు నమ్మవద్దు...
శ్రీరామ్ టిడిపి జెండా ఎగురవేస్తాడు



ధర్మవరం జనవరి 05 ,)పట్టణాన్ని ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే సమస్యలకు నిలయంగా మార్చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా రెండవ రోజు శ్రీరామ్ పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం శాంతినగర్ లోని గ్యాస్ గోడౌన్ వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. ఆ తర్వాత 1వ వార్డు శాంతినగర్ నుంచి, చంద్రబాబు నగర్, శారదా నగర్, శివా నగర్, తిక్కస్వామి నగర్, సిపిఐ కొట్టాల, కేశవా నగర్ 8వ వార్డు వరకు అలాగే 17వ వార్డు సంజయ్ నగర్ వరకు పాదయాత్ర సాగింది. మొత్తం 9వార్డులలో పాదయా త్రను పూర్తి చేశారు. ఈ సందర్భంగా చాలా కాలనీల్లో ప్రజలు మగ్గాల వలన తమకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని, అలాగే నిరుద్యోగ సమస్య, డ్రైనేజీ, రోడ్ల సమస్యల గురించి శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిచోట శ్రీరామ్ సమస్యలను ఓపికగా ఉన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎంతోమందికి రేషన్ కార్డులు తొలగించారని శ్రీరామ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అన్ని అర్హతలు ఉన్నా వృద్ధాప్య, వితంతు పింఛన్లు అందడం లేదని వాపోయారు. సమస్య ఉన్న ప్రతి చోట వారి వివరాలు ఫోన్ నెంబర్లతో సహా తీసుకున్నారు. ఈ సమస్యలన్నింటికీ టిడిపి అధికారంలోకి రాగానే పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు కొందరు మైనార్టీ నేతలు శ్రీరామ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తుల పరిరక్షణ, ముస్లిం మైనార్టీలను వివక్షకు గురి కాకుండా అట్రాసిటీ చట్టం, దుల్హన్ పథకాన్ని 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం యువతకు ఉపాధి అవకాశాలు, 50 శాతం సబ్సిడీతో రుణాలు వంటి అంశాలను శ్రీరామ్ దృష్టికి తీసుకొ చ్చారు. వీటన్నింటిపై కచ్చితంగా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మొదటినుంచి ముస్లిం మైనార్టీలకు పరిటాల రవితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. వారి అభిమానాన్ని అలాగే నిలుపుకుంటానని... వారు అడిగిన ప్రతి ఒక్కటి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో వారిని కలిసి సంఘీభావం తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందిం చకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికే మీ సమస్యలు చంద్రబా బు దృష్టికి వచ్చాయని అధికారంలో రాగానే వాటిని పరిష్కరిస్తా రన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో ఏ కాలనీ చూసిన చెత్త మయంగా మారిందన్నారు. మరోవైపు ఎలాంటి కారణాలు లేకుం డా రేషన్ కార్డులు తొలగించడం అన్ని అర్హతలు ఉన్నా పింఛన్లు, అమ్మఒడి ఇవ్వకపోవడం ఇలా చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు.వీటన్నింటికీ నిర్దిష్టమైన కాల పరిమితిలో పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు...వైసీపీకి షాక్.. టిడిపిలోకి యువత చేరిక శ్రీరామ్ పాదయాత్రలో భాగంగా 5వ వార్డుకు వచ్చిన సమయంలో వైసీపీలో కీలకంగా పని చేస్తున్న 30 మంది యువకులు తెలుగు దేశం పార్టీలో చేరారు. ఐదవ వార్డుకు శ్రీరామ్ రాగానే ఆ యువకులంతా పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంద రికీ శ్రీరామ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీతోనే యువత భవిష్యత్తు బాగుంటుందన్న ఉద్దేశంతోనే తాము పార్టీలోకి చేరినట్లు చెప్పారు. శ్రీరామ్ నాయకత్వంలో ధర్మవరంలో పని చేస్తామని వారు స్పష్టం చేశారు. పార్టీలోకి చేరిన వారిలో నిజాం, అరవింద్, మహమ్మద్, కుల్లాయి, మనీ, ప్రశాంత్, రెడ్డి, యతీష్, వెంకటేష్ లు ముఖ్యులుగా ఆలోచన లేకుండా సందర్భంగా శ్రీరామ్ వారికి సూచించారు.

## శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం 52 వ రోజు అన్న ప్రసాద వితరణ..



విభారె న్యూస్ జనవరి 05 ఎమ్మిగనూరు...స్థానిక శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా 14.11.2023 కార్తీక పాద్యమి నుండి 05.01.2024 శుక్రవారం వరకు మాల ధారణ స్వాములందరికీ 52 రోజుల వరకు అన్న ప్రసాద వితరణ అయ్యప్ప స్వామి దయవలన నిర్విరామంగా జరిగినది. చివరి రోజు 5 వ తేదీ శుక్రవారం చివరి రోజు కావడంతో వడ్డీల గురుస్వామి ఆశ్రమం వారు అన్నదాన కమిటీ సభ్యులకు చిరు సన్మానం గావించారు. అనంతరం అన్నదాన కమిటీ గురు స్వాములు రంగారెడ్డి గురు స్వామి, వడ్డీల గురుస్వామి, రవి గురుస్వామి, చిన్ని శ్రీనివాసులను సన్మానించారు. అనంతరం అన్నదాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సన్మానం గావించిన వడ్డీల గురుస్వామి ఆశ్రమం వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. గత 52 రోజులగా ఆ హరిహర పుత్రుని ఆశీర్వాదంతో అన్న ప్రసాద వితరణకు సహకరించిన దాతలు అందరికీ, మాకు సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ శబరిగిరీషుడు ఎల్లవేళలా ఆయురారోగ్యాలను ప్రసాదించాలని అయ్యప్పని వేడుకుంటున్నామన్నారు.

## శుక్రవారం రాహుకాల సమయంలో మహా గౌరి అమ్మవారికి విశేష పూజలు..



విభారె న్యూస్ జనవరి 05 కర్నూలు (జిల్లా ప్రతినిధి).శుక్రవారం రాహుకాల సమయంలో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మహా గౌరీ అమ్మవారి సన్నిధిలో రాహుకాల, దుర్గా పూజ, లలితా సహస్రనామ పారాయణం జరిగినది.

## టోల్ గేట్ పాట రు 1.71 కోట్లు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 05-మహానంది క్షేత్రమ్ లో ఏడాది వసూళ్లకు సంబందించి టెండర్లు పిలిచారు.అత్యధికంగా మహానంది కీ వచ్చే వాహనాలు కు వసూలు చేసే వేలం భారీగా పోయింది..2024కు గానూ శివశంకర్ రెడ్డి అనే కాంట్రాక్టర్ రూ 1.71 కోట్లు చెల్లించడానికి ముందుకు వచ్చినట్లు అధికారవర్గాలు తెలిపాయి.ఇఓ చంద్ర శేకర్ రెడ్డి,చర్మైన్ మహేశ్వర్ రెడ్డి లు ఈ వేలం పాటలు జరిపారు.8అంశాలు పై జరిపిన వేలం పాటల్లో రూ 2.71కోట్లు చెల్లించడానికి కాంట్రాక్టర్ లు ముందుకు వచ్చినట్లు సమాచారం.అతి ఎక్కువ గా టోల్ గేట్ కు రాగా ఆతరువాత 2,3,4,5స్తనాలో అభిషేక సేవకురూ 47లక్షలు,సెల్ పాయింట్ వేలం కు రూ 18.27 లక్షలు ,మరుగు దొడ్లు వేలం కు రూ 12 లక్షలు , సంప్రదాయ దుస్తులు వేలం కు రూ 8.50 లక్షలు వేలం దారులు పాడినట్లు తెలిసింది.. బోర్డ్ సమావేశమ్ లో ఆమోదించి వేలం దారులకు గ్రీన్ సిగ్నల్ ఈస్తారు.



# సర్పంచ్ లారీ దగ్ధం..ఉద్రిక్తత

జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సర్పంచ్ జ్యోతికి చెందిన లారీకి గుర్తుతెలియని వ్యక్తులునిప్పుపెట్టినఘటనపై స్థానికుల ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడి చేరుకునివిచారణ చేపట్టారు. గత కొంతకాలంగా ఆ ముగ్గురువ్యక్తులుగ్రామంలోఅలజడి సృష్టిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారని, గతంలో తమకు చెందిన వరి కోత యంత్రాన్ని కూడా ధ్వంసం చేశారని.. ఆ విషయంపై పోలీసులు ఫిర్యాదులు చేసినా సరిగా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టాలని సర్పంచి జ్యోతి, భర్త బ్రహ్మం డిమాండ్ చేస్తున్నారు.

## బాలిక మిస్సింగ్..

చంద్రగిరి,చంద్రగిరిలో బాలిక మిస్సింగ్ కలకలం రేపుతోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాజేష్ నాయక్ కుమార్తె సోనీ కుమారి (6) కనిపించకుండా పోయింది. తండ్రి రాజేష్ నాయక్ ఎం.కొంగరవారిపల్లి దగ్గర జగనన్నకాలనీలో సిమెంట్ బ్రిక్స్ బట్టీలో పని చేస్తున్నాడు. కూలీ పనులు కోసం జార్ఖండ్ నుంచి రాజేష్ నాయక్ కుటుంబం వలస వచ్చింది.గురువా రం వరకు బాలిక ఆచూకీ లభించలేదు .ఓ వ్యక్తి పై అనుమానంతోపట్టుకునిపోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తిని విచారించి వదిలేయడంతో కుటుంబ సభ్యులుమండిపడుతున్నారు. రెండు రోజులుగా పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో పోలీసులు గాలిస్తు న్నారు.రోజులు గడిచే కొద్దీ రాజేష్ నాయక్ కుటుంబం భయాందోళ నలకు గురవుతోంది.

## కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

వెంకటగిరి,నెల్లూరు జిల్లా వెంకటగిరి 14వ వార్డు పరిధిలోని పుల్లయ్యబడి వద్ద ఏడేళ్ల చిన్నారి హాసినిపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో హాసిని తీవ్రంగా గాయపడింది. వీధి కుక్క ల దాడిలో ఏడేళ్ల చిన్నారి హాసిని తీవ్రగాయాలై ఆసుపత్రికి పాలైన ఘటన గురువారం తిరుపతి జిల్లాలోని వెంకటగిరి మున్సిపాలిటీ లో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నరసింహారావు వీధికి చెందిన హాసిని గురువారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. హాసినిపై చేస్తున్న కుక్కల దాడిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కుక్కలను తరిమేశారు. చిన్నారి హాసిని చేతులు, ముఖం పైకుక్కలు కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అవి మనుషులపై గుంపులుగా దాడిచేస్తున్నాయని, కుక్కలబెడద నుంచి మమ్మల్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ని గ్రామస్థులు కోరుతున్నారు

## మునిసిపల్ అధికారులను అడ్డుకున్న కార్మికులు

**పోలీసుల జోక్యం**

హిందూపురం,హిందూపురం పట్టణంలో మునిసిపల్ కార్మికులకు అధికారులకు మధ్య గొడవ చోటు చేసుకుంది. మున్సిపల్ కార్మికుల సమ్మెతో హిందూపురం పట్టణంలో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. దింతో పర్మినెంట్ వర్కర్స్ తో క్లీన్చేయించేం దుకు మున్సిపల్ అధికారులు అంబేద్కర్ సర్కిల్ వద్దకు పోలీసుల సహకారంతో చేరుకున్నారు. అయితే వీరిని ఏఐటియుసి ఆధ్వర్యంలో సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు.శ్రీ సత్య సాయి జిల్లా హిందూ పురంలో మున్సిపల్ కార్మికుల సమ్మెలో ఉండటంతో పట్టణంలో పలు చోట్ల రోడ్లపై చెత్తాచెదారం పేరుకు పోయింది.

# విజయనగరంలో తమ్ముళ్ల పోటీ

**సీటు నీదా...నాదా**

విజయనగరం, జనవరి 5, విజయనగరం జిల్లా తెలుగుదేశం రాజకీయం బంగ్లా నీడలోనే నడిచేది. అటువంటి చోట తొలిసారి ధిక్కార స్వరం ప్రతిధ్వనించింది. ధ్వనించడమే కాదు అశోక్ నాయకత్వాన్ని బహిరంగంగా సవాలై నిలిచింది. అక్కడకే పరిమితం కాలేదు. బస్తీమే సవాల్ అన్నట్లు సమీపంలోనే మరో కార్యాలయం కూడా తెరుచుకుంది. వీటన్నింటి రీత్యా ఎన్నడూ లేనంతగా టి.డి.పి. బలహీనంగా కనిపించడం అనివార్యమయ్యింది. స్థానిక సంస్థల ఎన్నికలలో టి.డి.పి. ఉనికే ప్రశ్నార్ధకంగా మారిపోయింది. ఈ పరిణామాలు అన్నింటి వలనే టి.డి.పి.లో అభ్యర్థి ఎవరు అన్న అంశం తెరమీదకి వచ్చేటట్లు చేసింది. అందరూ చర్చించుకునే అవకాశాన్ని కల్పించింది. ఒక పక్క విజయనగరం పార్టీ ఇన్ చార్జ గా అధితి గజపతిరాజు కొనసాగుతున్నారు. ఎమ్మెల్యేగా అశోక్ గజపతిరాజు నిలుస్తారని పార్టీ శ్రేణులు నమ్ముతున్నారు. ఇంకో పక్క బి.సి. కార్డుతో మీసాల గీత టిక్కెట్ కోసం పోటీలో నిలిచారు. ఇలా ముగ్గురు టి.డి.పి. చిత్రంలో రక్తికట్టిస్తున్నారు. ఇంతకూ అభ్యర్థి ఎవరు అన్నది మాత్రం ప్రస్తుతానికి ఓ ప్రశ్నే!? అధితి గజపతిరాజు భవిష్యత్ కి గ్యారంటీలో భాగంగా ఇంటింటి ప్రచారంలో షాక్ ఇచ్చే ప్రకటన చేశారు. అశోక్ గజపతిరాజు కుమార్తె అధితి గజపతిరాజు విజయనగరం అభ్యర్థి అని మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి తమ వార్డు పరిధిలో ఓ అవ్వకి పరిచయం చేశారు. ఆ క్రమంలోనే "ఎమ్మెల్యేగా నేనే పోటీచేస్తున్నా" అని ఆమె పరిచయం చేసుకున్నారు. పరిచయం చేసుకోవడమే కాదు. గడిచిన నెల రోజులుగా రాజకీయంగా ఆమె యాక్టివేట్ అయ్యారు. పార్టీ కార్యక్రమంలోనే కాదు. ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనల్లో కూడా భాగస్థులవుతున్నారు. పార్టీసమావేశాలలో అగ్రస్థానంలో నిలుస్తున్నారు. కొద్ది కాలం విరామం తరువాత ఆమె క్రియాశీలకంగా మారారు. దీంతో ఆమె ప్రకటించుకున్న విధంగా తానే అభ్యర్థి అన్న సంకేతాలను ఇచ్చారు. ఇప్పటికీ ఇస్తూనే ఉన్నారు.సరిగ్గా ఈ ప్రకటనే ఇప్పుడు విజయనగరంలో సంచలనంగా మారింది. రేపటి ఎన్నికలలో ఎవరిని టిక్కెట్ వరిస్తుందో ఎవరూ చెప్పుకోలేని అయోమయ పరిస్థితి. అలాంటి స్థితిలో అధితి గజపతిరాజు చేసిన ప్రకటన రాజకీయంగా హె?రెత్తిస్తోంది. ఇన్ చార్జ లుగా కొనసాగుతున్న వారిలో అవసరమైతే కొంత మందిని మార్చుతామని చంద్రబాబు గతంలో ఇచ్చిన సంకేతాలు ఉండనే ఉన్నాయి. ఏ చోట అభ్యర్థి ఎవరో కనీస స్థాయిలో కూడా లీకులకు తావులేని పరిస్థితి కొనసాగుతోంది. దీనికి ప్రధాన కారణం పొత్తు రాజకీయాలే అన్నది సుస్పష్టం.పొత్తులు ఇంకా పొడవకముందే, సీట్లు సర్దుబాటు కాకముందే తనకి తానుగా తానే ఎమ్మెల్యేగా పోటీచేస్తున్నానని చెప్పడం వైరల్ గా మారడం సహజం. అధిష్టానం నుంచి గానీ, అశోక్ గజపతిరాజు నుంచి గానీ ఎటువంటి ప్రకటనా ఇప్పటికైతే వెలువడలేదు. కాని, పార్టీ ఇన్ చార్జ గా ఉన్న అధితి స్వయం ప్రకటన అనేక ఆలోచనలకి, విశ్లేషణలకు తావిచ్చింది. ఇప్పటికీ తావిస్తూనే ఉంది. వాస్తవానికి ఆమెనే ఎన్నికల బరిలో నిలపాలని పార్టీ నిర్ణయించుకుందా? లేక మరొక గొంతుకు తావు లేకుండా నిరోధించే వ్యూహమా ? అన్నది ప్రస్తుతానికి ఊహాగానంగానే ఉంది. మొన్నటి ఎన్నికలలో అధితి గజపతిరాజు, అశోక్ గజతిరాజు ఓటిమి పాలుకావడంతో బంగ్లాలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కొంత మందిని దూరం పెట్టారు. అధితి నాయకత్వం ఇష్టం లేని వారు మీసాల గీతకి అండగా నిలిచారు. ఆమెతో నడుస్తున్నారు. ఆమె ప్రత్యేకంగా కార్యాలయం తెరిచారు. దీంతో మీసాల గీత తెరిచిన కార్యాలయంలో హడావిడి మొదలయ్యింది. ఈ క్రమంలోనే బి.సి. నినాదం పార్టీలో చాపకింద నీటిలా నడిపేందుకు పావులు కదిలాయి. అస్వస్థత నుంచి తేరుకున్న అశోక్ గజపతిరాజు పార్టీని చక్కదిద్దే చర్యలు చేపట్టారు. ప్రధాన సామాజిక వర్గాలకు పార్టీ కమిటీలకు సారధుల్ని చేశారు.ఆ మేరకు గీతకి చెక్ చెప్పారు. పార్టీ ఇన్ చార్జ్ గా అధితి గజపతిరాజు కొనసాగించారు. అశోక్ గజపతిరాజే స్వయంగా వ్యవహారాలను నడుపుతున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం పరిస్థితుల్లో అసెంబ్లీ బరిలో అశోక్ గజపతిరాజు నిలుస్తారన్న ప్రచారం సాగింది.అయినా, మీసాల గీత వర్గం మాత్రం పునరాలోచన చేయలేదు. కార్యాలయ తలుపులు మూయలేదు. బి.సి. సమావేశాలలోనూ, అధిష్టానానికి అందుబాటులోనూ ఉంటూ వస్తున్నారు. మొన్నటి చంద్రబాబు అరెస్టుకి వ్యతిరేకంగా వేరే వర్గంగా ప్రజల్లోకి వెళ్లారు. మీడియా సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు.ఇటువంటి వాతావరణంలో అసెంబ్లీ బరిలో తానే నిలుస్తున్నట్లుఅధితి గజపతిరాజు తేల్చేశారు. ప్రకటించడమే కాదు పూర్తి స్థాయిలో క్రియాశీలంగా మారారు. ప్రజాందోళనలకు మద్దతుగా నిలుస్తున్నారు. పార్టీ సమావేశాలలో ముందు భాగాన కనిపిస్తున్నారు. మరో ఆలోచనలకి, మరో వాదనలకీ తావు లేకుండా చేశారు. చూసిన వారికి అభ్యర్థి ఆమెనేమో అనిపించేంతగా పరిస్థితి మొత్తాన్ని మార్చేశారు. ఇప్పుడిదే చర్చనీయాంశంగా మారింది. నిజంగానే ఆమె బరిలో నిలుస్తున్నారా? లేక బయట జరుగుతున్న చర్చలకు ఫుల్ స్టాప్ పెట్టాలని వ్యూహం పన్నారా ? అన్నది తేలాల్సి ఉంది. ఈ మధ్య కాలంలో బంగ్లాకూ, గీత కార్యాలయానికి మధ్య అటూ, ఇటూ నడిచే వారి అధికమవుతున్నారు. అటువంటి ఊగిసలాటలకి తావులేకుండా చేయాలని అధితి వచ్చినట్లు ఆమె ప్రకటన చెప్పకనే చెబుతోంది. ఒక అడుగు ఇటు, మరో అడుగు అటు వేస్తున్న నాయకులకు ఎటో తేల్చుకోవాలని చెప్పినట్లుగానూ అర్ధమవుతుంది. దీంతో బంగ్లాలో ఇప్పటికే మసులుతున్న వారికీ, గీత ఆవరణంలో ఉన్న వారికి ఒక క్లారిటీ ఇచ్చినట్లు అయ్యింది. అదే నిజమైతే విజయనగరంలో రాజకీయం ఎలా ఉంటుందో?!

# షర్మిలకు అంత సీన్ ఉందా...



విజయవాడ, జనవరి 5, తోచీ తోచనమ్మ తోటి కోడలు పుట్టింటికి వెళ్లిందట" ఈ సామెత సోషల్ మీడియాలో వైఎస్ షర్మిలపై వైరల్ అవుతుంది. అయితే ఈ సామెత షర్మిలకు ఎంత వరకూ వర్తిస్తుందన్నది పక్కన పెడితే ఆమె అతి విశ్వాసానికి పోయి ఉన్న ఇమేజ్ కాస్తా పోగొట్టుకునే అవకాశాలు మాత్రం పుష్కలంగానే కనిపిస్తున్నాయి. వైఎస్ షర్మిల మాట తీరును చూస్తుంటేనే అది అర్థమవుతుంది. తనవల్లనే తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిందని చెప్పడం అతిశయోక్తిగానే కాదు ఆశ్చర్యంగానే కనిపిస్తుంది. తాను పోటీ చేయకపోవడం వల్ల తెలంగాణలో 31 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని చెప్పడం హాస్యాస్పదంగానే చూడాల్సి ఉంటుంది. విజయమ్మకు ఇబ్బందికరమే తెలంగాణలో పార్టీ పెట్టి... వైఎస్ షర్మిల అసలు తెలంగాణలో పార్టీ పెట్టడమే పెద్ద తప్పు. సీమాంధ్రకు చెందిన నేతగా తెలంగాణలో పార్టీ పెట్టి ఏం చేస్తారని ఆమె వైఎస్సార్టీపీని పెట్టినప్పుడే అందరూ వ్యాఖ్యానించారు. అయితే వైఎస్ మద్దతుదారులతో పాటు జగన్ సైన్యం అండగా ఉంటుందని భావించారు. మూడు వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేశారు. పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. అక్కడ పార్టీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. చివరకు తాను పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. కేసీఆర్ ను ఓడించడానికి అంటూనే కాంగ్రెస్ ను గెలిపించడానికి తన పార్టీ ఎన్నికలలో పోటీ చేయలేదని చెప్పి పక్కకు తప్పుకున్నారు. దీంతో ఆ పార్టీ నేతలు చాలా మంది బీఆర్ఎస్ లోకి వెళ్లిపోయారు. పరమార్థం వేరే ఉందట లోటస్ పాండ్ వైపు కూడా... ఇప్పుడు తెలంగాణలో వైఎస్ షర్మిల వెంట ఉంది అతి కొద్ది మంది మాత్రమే. వారిలోనూ పేరున్న నేతలు ఎవరూ లేరు. తెలంగాణ కాంగ్రెస్ కూడా షర్మిలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఆమె కూడా తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభినందనలు తెలిపి ఊరుకున్నారు తప్పించి ఎవరినీ కలిసే ప్రయత్నం చేయలేదు. చివరకు షర్మిలను కూడా కాంగ్రెస్ లో ఉన్న నేతలు, గెలిచి మంత్రులుగా ఉన్న వారు కూడా కలవలేదు. అదీ షర్మిలకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న పట్టు అని చెప్పకతప్పదు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో దాదాపు షర్మిల తండ్రి కేబినెట్ లో పనిచేసిన మంత్రులే అధికంగా ఉన్నారు. వైఎస్ రాజకీయ బిక్ష పెట్టిన వారు కూడా లోటస్ పాండ్ వైపు చూడలేదంటే పరిస్థితిని వేరే చెప్పనక్కర లేదు. ఇక ఇదే సమయంలో ఈరోజు వైఎస్ షర్మిల ఢిల్లీకి బయలుదేరి వెళ్లి కాంగ్రెస్ లో చేరిపోయారు. అందుకు ఎవరికీ అభ్యంతరం లేదు.సరైన సమయంలో బటన్ నొక్కేశారుగా నష్టమంటూ జరిగితే... షర్మిల చేరితే కాంగ్రెస్ కు వచ్చేది లేదు. పోయేది లేదు. నష్టం అంటూ జరిగితే అది షర్మిలకే తప్ప కాంగ్రెస్ కు కొత్తగా జరిగే నష్టమంటూ ఏదీ ఉండదు. అయితే అన్న జగన్ కూడా ఇవ్వని ప్రాధాన్యత కాంగ్రెస్ నేతలు ఇస్తారంటే ఎలా నమ్ముతావామ్మా అని కొందరు నెటిజన్లు కామెంట్స్ పోస్టు చేస్తున్నారు. నిజంగా కాంగ్రెస్ పార్టీ ఏపీ ఎన్నికల్లో వైఎస్ షర్మిలను ఆ పార్టీ తరుపున ప్రచారానికి దించితే అక్కడ పెద్దగా ఉపయోగం ఏమీ ఉండదు. ఏపీలోనూ ఉన్న ఇమేజ్ కూడా పోయే అవకాశాలున్నాయి. ఏదైనా గుప్పటి మూసేంత వరకే.. తెరిచి చూస్తే... అన్న తరహాలో ఇప్పుడు షర్మిల ఏపీలో అడుగు పెట్టి తన పేరుతో పాటు తండ్రి వైఎస్ పేరును బద్నాం చేయడం ఎందుకన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇంతకీ ఆమె ఏపీలో ఏం చేయాలనుకుంటున్నారు? అని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇంతకూ ఏపీలోకి వెళ్లి వైఎస్ షర్మిల ఏం చెబుతారు? వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరు మార్చి మళ్లీ రాజీవ్ ఆరోగ్యశ్రీ గా పెట్టమంటారా? వైఎస్సార్ ఆసరా పింఛన్లు తీసి సోనియా పించన్లు తీసుకు వస్తామని చెబుతారా? వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి ప్రత్యామ్నాయంగా మరో పేరు పెట్టమంటారా? వైఎస్ కుమారుడు జగన్ పరిపాలన బాగా లేదని, కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకు వస్తే రాజన్న రాజ్యాన్ని తెస్తామని చెబుతారా? ఇవన్నీ వైఎస్ అభిమానుల నుంచి షర్మిలకు దూసుకొస్తున్న ప్రశ్నలు. నిర్ణయం తీసుకున్నంత తేలికైన విషయం కాదు.. ప్రజలను మెప్పించడం.. నమ్మించడం. అందుకే షర్మిల మరోసారి రాంగ్ స్టెప్ వేస్తున్నారన్న వ్యాఖ్యలే ఎక్కువగా రాజకీయ పార్టీల్లో వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో నాటకీయత ఉండదు. అంతా వాస్తవరూపంలోనే ఉంటుంది. షర్మిలను ఏపీ ప్రజలు ఎలా చూస్తారన్నది భవిష్యత్ లో తేలనుంది.

## రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి గాయాలు

నెల్లూరు,నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రేగడిచెలిక సమీపంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ యాక్సిడెంట్లో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రశేఖర్రెడ్డి పీఏ వెంకటేశ్వర్లు ఘటనాస్థలంలోనే చనిపోయారు. విజయవాడ నుంచి నెల్లూరు వస్తుండగా అర్ధరాత్రి ఘటన జరిగింది. . ప్రమాద సమయంలో కారులో మొత్తం ఐదుగురు ఉండగా గాయపడినవారిని నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి హుటాహుటిన తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎమ్మెల్సీ తలకు గాయాలయ్యాయి. కారు ముందు వెళుతున్న లారీ టైరు పంక్చరు కావడంతో ఒక్కసారిగా నెమ్మదించిందని, దీంతో లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టిందని స్థానికులు చెబుతున్నారు. లారీని ఢీకొని డివైడర్పై పడిపోయింది.

# కర్నూలు ఫ్యాన్ లో ముసలం

కర్నూలు, జనవరి 5, ఏపీలో ఎన్నికల హడావిడి మొదలైంది. అన్ని పార్టీలు అప్పుడే వివిధ రకాల కార్యక్రమాలతో ప్రచార యుద్ధంలోకి దిగాయి. గెలుపు మాదంటే మాదంటూ అన్ని సవాళ్లు విసురుతున్నాయి. గతంలో లాగా కాకుండా ఈసారి ఎన్నికలు హోరాహోరిగా ఉండనున్నాయి. వై నాట్ 175 అంటోన్న అధికార పార్టీ వైసీపీ ఇప్పటికే వ్యూహాలతో ముందుకువెళ్తోంది. ఇందులో భాగంగానే పనితీరు బాగోలేని ఎమ్మెల్యేలను, ఇంచార్జీలను తప్పించి కొత్త అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా ప్రకటిస్తుంది. అయితే, ప్రస్తుత ఎమ్మెల్యేలు కొందరూ తమకు సీట్లు కేటాయించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా కర్నూలు ఎమ్మిగనూరు వైసీపీలో అసమ్మతి పెరుగుపోతోంది. మచాని వెంకటేష్ ను నియోజకవర్గ ఇంచార్జిగా అధిష్టానం ప్రకటించడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వర్గం. ఈ క్రమంలో ఎమ్మిగనూరులో వైసీపీ ముఖ్య నాయకులు భేటి అయ్యారు. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల ఎంపీపీ లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ లు హాజరైయ్యారుఎమ్మెల్యే సీటు చెన్నకేశవ రెడ్డి కుటుంబానికే టికెట్ కేటాయించాలి డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మిగనూరు లో ఎలాంటి బీసీ నినాదం లేదని కేవలం డబ్బులు ఇచ్చి తప్పుడు సర్వే రిపోర్ట్ పంపించారని విమర్శలు చేస్తున్నారు. ఎమ్మిగనూరు టికెట్ చెన్నకేశవ రెడ్డికి కాకుంటే పార్టీ జెండా మోసిన వారికైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ విషయాలపై అధిష్టానం స్పందిస్తుందా? లేదా అనేది చూడాలి. కాగా, గతంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నా కేశవ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2024లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తననే ప్రకటించాలని కోరారు. మరి టికెట్ కేటాయించకపోవడంతో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఏం చేయనున్నారనేది ఆసక్తికరంగా మారిందిఇదిలా ఉంటే.. అధికార పార్టీ వైసీపీలో టికెట్ల పంచాయితీ తారా స్థాయికి చేరింది. పలు సీట్లలో సిట్టింగ్ లను మార్చి వేరే వారిని సమన్వయకర్తలుగా నియమించడంతో టికెట్ దక్కని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ పార్టీకి రాజీనామ చేశారు. ఇదే అదనుగా పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్ లపై స్థానిక నేతలు. ఆశావహులు అసంతృప్తి గళం వినిపిస్తున్నారు.

## కాకినాడ నుంచే జనసేనాని పోటీ...



కాకినాడ, జనవరి 5, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ నుంచే పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కాకినాడపై పవన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కాకినాడను సొంత నియోజకవర్గంగా మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కాకినాడలో 50 వార్డులు ఉంటే ఏయే వార్డులో ఏయే సామాజికవర్గాలు ఎక్కువగా ఉన్నాయో వారి పెద్దలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే 28 వార్డుల పెద్దలతో మంతనాలు పూర్తి చేశారు పవన్ కల్యాణ్. మరో రెండు మూడు రోజుల్లో పవన్ కల్యాణ్ మళ్లీ కాకినాడ వెళ్లబోతున్నారు. కాకినాడ టూర్ లో భాగంగా 22 వార్డులపై సమీక్ష నిర్వహించబోతున్నారని సమాచారం.కాకినాడలో సొంత నివాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు పవన్ కల్యాణ్ సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. కాకినాడ చుట్టు పక్కల విశాలమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. కాకినాడ నగరం నుంచి పోటీ చేస్తే ఆ ప్రభావం కాకినాడ జిల్లాపై పడే అవకాశం ఉందని అందుకే పవన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహారంపై పవన్ గతంలో చాలా సార్లు ఫైర్ అయ్యారు. ఆయన రౌడీ యిజాన్ని అణిచి వేస్తానన్నారు. గతంలో వారాహి యాత్ర జరిగినప్పుడు పవన్ కాకినాడ నుంచి పోటీ చేయాలని ద్వారంపూడి సవాల్ చేశారు. అయితే అప్పటికే పవన్ కాకినాడ విషయంలో ఓ నిర్ణయానికి వచ్చారని కానీ వైసీపీ ట్రాప్ లో పడటం ఇష్టం లేక ప్రకటన చేయలేదని అంటున్నారు.ఇప్పుడు టీడీపీతో పొత్తు ఉండటం.. కాకినాడ సిటీలో అత్యధికంగా కాపు సామాజికవర్గ ఓట్లు ఉండటం.. టీడీపీ క్యాడర్ కూడా బలంగా ఉండటంతో.. కాకినాడ నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. ఎమ్మెల్యే ద్వారంపూడిపై అసంతృప్తి ఉందని జనసేన వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. ఈ క్రమంలో రెండు, మూడు ప్రైవేటు సంస్థలతో సర్వేలు చేయించుకుంటే.. మంచి మెజార్టీతో గెలుస్తామని పలితం వచ్చినట్లుగా తెలుస్తోంది. దీంతో పవన్.. కాకినాడను ఫైనల్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది.గత ఎన్నికల్లోపవన్.. ప.గో జిల్లాలోని భీమవరం, విశాఖలోని గాజువాక నుంచి పోటీ చేశారు. కానీ రెండు చోట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. దీంతో ఆయనపై రాజకీయంగా విమర్శలు వచ్చాయి. పవన్ ఎక్కడ పోటీ చేసినా ఓడించేందుకు వైసీపీ నేతలు తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేస్తారు. అందుకే ఈ సారి మరింత సేఫ్ సీటును రిజర్వ్ చేసుకున్నట్లు?గ తెలుస్తోంది. ఈ సారి పవన్ కల్యాణ్ ఎక్కడ పోటీ చేసినా గెలుస్తారని.. గెలుపు ముఖ్యం కాదని.. మెజార్టీ ముఖ్యమని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో.. గట్టి చాలెంజ్ విసిరే వైసీపీ నేతలపై పోటీ చేసి గెలవాలనుకున్నారని అంటున్నారు. ద్వారంపూడితో కరెక్ట్ పోరు జరుగుతుదంని పవన్ డిసైడయినట్లుగా కనిపిస్తోంది.

## కొత్తూరు వద్ద బస్సు, లారీ ఢీ

**ఒకరి మృతి,మరో నలుగురికి గాయాలు**

తిరుపతి,తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం కొత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఛత్తీస్గడ్ నుండి తిరుమలకు వెళ్తున్న బస్సును ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ప్రమాదం లో బస్సు డ్రైవర్ ఘటనా స్థలంలోనే మరణించగా, లారీ డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న మరో నలుగు ప్రయాణికులకు కూడా గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# అధికారం టిడిపిదే : కోట్ల రాఘవేంద్ర రెడ్డి

**-కోట్ల రాఘవేంద్ర రెడ్డి ని కలిసిన టిడిపి నేతలు..**



విభారె న్యూస్ జనవరి 05ఎమ్మిగనూరు.. 2024 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తనయుడు టిడిపి యువ నేత కోట్ల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదోనిలో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతున్న కోట్ల రాఘవేంద్ర రెడ్డిని మార్గమధ్యలో ఎమ్మిగనూరు శివారులో టిడిపి నేతలు కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి పెద్ద నేలటూరు పరమేశ్వర రెడ్డి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు,మల్కాపురం పురుషోత్తమ రెడ్డి, మైనార్టీ నాయకులు ఆఫ్గాన్ వలి భాష తదితరులుకలిశారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి నేతలతో కోట్ల రాఘవేంద్ర రెడ్డి కాసేపు మాట్లాడారు. ఎన్నికల్లో మనమందరం సమిష్టిగా పనిచేసి జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. టిడిపి కార్యకర్తలకు తమ కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసాను ఇచ్చారు.

## శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణ కు భక్తుల విరాళం.



విభారె న్యూస్ జనవరి 05 శ్రీశైలం. 05. 01. 2024 నాడు అన్నప్రసాద వితరణ పథకానికి కి విరాళం రూ. 1,00,116/-లను వి.వి.ఎస్. శ్రీధర్, తిరుపతి వారు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణిధర ప్రసాద్ కు అందజేయడం జరిగింది.

## గో సంరక్షణ పథకానికి భక్తుల విరాళం..




విభారె న్యూస్ జనవరి 05 శ్రీశైలం...05. 01. 2024 గో సంరక్షణ పథకానికి విరాళం రూ. 1,00,001/-లను పి.వి. రవీంద్ర, బెంగుళూరు వారు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణిధర ప్రసాద్ కు అందజేయడం జరిగింది.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 5 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, సంజీవరెడ్డి,రమణ, మహేష్, ఎడ్యుకేషన్ సెక్రటరీ షాజిదా 100%జి ఇ ఆర్ సాధన కోసం, 5నుండి 18 సంవత్సరాల పిల్లలు బడిలోనే ఉండాలని ర్యాలీ చేపట్టారు. బడి ఈడు పిల్లలు- బడిలోనే ఉండాలి, పిల్లలు బడికి -పెద్దలు పనికి, ఆడపిల్ల చదువు-అవనికి వెలుగు అనే నినాదాలతో పురవీధుల్లో ర్యాలీ యందు నినాదాలు చేశారు.

# 25వ రోజు ఒంటి కాలిపై నిలబడి నిరసన...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 5 డోన్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె 25వ రోజు శుక్రవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో ఒంటి కాలిపై నిలబడి ప్రభుత్వాన్ని వేడుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి టి. శివరాం,మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.రామాంజనేయులు,ఏవి. భాస్కర్ రెడ్డి,కోశాధికారి బి. నాగమద్దయ్య,పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన, రహమద్బి,సుమలత మాట్లాడుతూ ప్రభుత్వం బెదిరింపులకు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే సచివాలయ ఉద్యోగులను అడ్డుకుంటామని చెప్పిన మాట ప్రకారం సమస్యలు పరిష్కరించలేని చేతకాని ప్రభుత్వం అంగన్వాడీ లపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నది అన్నారు. మరోవైపు చిన్నపిల్లలకు,గర్భవతులకు,బాలింతలకు ఇబ్బందులు కలగకూడదనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామంటున్న ప్రభుత్వం సమ్మె మొదలై 25 రోజులు అవుతున్నా సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ఇటువంటి దుర్మార్గపు ప్రభుత్వానికి పాలించే హక్కు ఎక్కడిది అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని ప్రభుత్వమే శాంతి భద్రతల సమస్యలు సృష్టించడం సిగ్గుచేటని అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,కనీస వేతనాలు ఇవ్వాలని,గ్రాట్యుటీ అమలు చెయ్యాలన్న ప్రధాన డిమాండ్లపై తేల్చకుండా సమ్మె ఆగదని ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఆదిలక్ష్మి రామలక్ష్మి ప్రమీల జ్యోతి శివలక్ష్మి రాజేశ్వరి లక్ష్మీదేవి శ్రీలత వరలక్ష్మి సుబ్బలక్ష్మి లక్ష్మీస్వరి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# ద్వైవార్షిక నగదు జిల్లాలో 2,585 మందికి రు.4.02 కోట్లు



మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లావిభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 05 – సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా లబ్ది పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కింద జిల్లాలో 2,585 మంది లబ్దిదారుల ఖాతాల్లో రు. 4. 02 కోట్లు జమ చేశామని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా తెలిపారు. శుక్రవారం నవరత్నాలు-ద్వైవార్షిక నగదు పంపిణీ కార్యక్రమం ద్వారా ఆగస్టు 2023 నుండి డిసెంబరు 2023 వరకు సంక్షేమ పథకాలకు సంబంధించి వివిధ కారణాల చేత లబ్ది పొందని 68,990 మంది అర్హులకు రూ. 97. 76 కోట్ల రూపాయలను నేడు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి గారి కార్యక్రమాన్ని కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారుతో పాటు డైరక్టర్ ఖాజీ మౌలానా అబ్దుల్ కలామ్, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, డిఆర్ఓ పుల్లయ్య, డిఆర్డిఏ పీడి శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు వీక్షించారు..ఇందులో భాగంగా అమ్మఒడి కార్యక్రమం కింద 1616 మంది లబ్ధిదారులకు రూ. 2. 30 లక్షలు, జగనన్న చేదోడు కార్యక్రమం కింద 614 మంది లబ్ధిదారులకు రూ 6. 14 లక్షలు, ఈబీసీ నేస్తం కింద 163 మంది లబ్ధిదారులకు రూ. 2. 44 లక్షలు, వైయస్సార్ కళ్యాణమస్థుమరియుషాధితోఫాకింద88 మంది లబ్ధిదారులకు 7. 42 లక్షలు, వైయస్సార్ కాపు నేస్తం కింద 27 మంది లబ్ధిదారులకు 4. 04 లక్షలు, వైయస్సార్ వాహన మిత్ర కింద 77మందిలబ్ధిదారులకు 7. 70 లక్షలు వెరసి మొత్తం రు. 2,585 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రు. 4. 02 కోట్లు జమ చేశామని రాష్ట్ర మైనారిటీ సలహాదారుడు హాబీబుల్లావివరించారు.

# పట్టణంలో ఎటువంటి అపరిశుభ్రత లేకుండా చూడండి :కమిషనర్ రవి చంద్రా రెడ్డి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 05-పట్టణంలో ఎటువంటి అపరిశుభ్రత లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం లో అమినిటీస్. శానిటేషన్ సెక్రటరీలతో సమావేశంలో . మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ వార్డు అమినిటీస్ సెక్రటరీ లు వారికి సంబంధించిన వార్డులలో డ్రైనేజీ లు,మ్యాన్ హోల్స్ మొదలగునవి ఎక్కడ అవసరమవుతాయి గుర్తించి అందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. పనులను పూర్తి చేయించాలన్నారు . నీటి నిల్వలు గల ప్రాంతాలు గుర్తించి ఆ నీరు నిల్వ ఉండకుండా మట్టితో కప్పి వేయడమా లేదా ఇతర ఏ ప్రత్యామ్నాయలనైనా ఆలోచించి ఆ సమస్యను తొలగించాలని శానిటేషన్ సెక్రటరీలకు వార్డు కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు . అదేవిధంగా వార్డు పర్యావరణ మరియు పారిశుద్ధ్య కార్యదర్శులకు పారిశుద్ధ కార్మికులు సమ్మెలో ఉన్నందున దినసరి కూలీలతో పారిశుద్ధ్య కార్యకలాపాలలో ఎటువంటి లోటు జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం కోసం యాక్షన్ ప్లాన్ తయారు చేయించడం మరియు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా , అపరిశుభ్ర వాతావరణం చోటు చేసుకోకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహించడం అందుకు తగిన పారిశుద్ధ్య కార్మికులను అదనంగా తీసుకుని పారిశుద్ధ్య పనులు జరిపించాలని ఆదేశాలు జారీ చేశారు . ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. ఎమ్ ఈఈ రమణ మూర్తి. డీఈలు జయబారత్ రెడ్డి. మదు కుమార్. శ్రీనివాస్ రెడ్డి. , శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మి నారాయణ. శానిటేషన్ ఇన్ స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి , అమినిటీస్. శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు .

# రైతులను ఆదుకోవాలి : భూమ కిషోర్ రెడ్డి



**పంటలను పరిశీలిస్తున్న భూమా కిషోర్ రెడ్డి**

ఆళ్లగడ్డ ప్రతినిధి జనవరి 05 విభారె న్యూస్ :- వర్ష భావం కారణంగా దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తాలూకా బిజెపి బాధ్యతలు భూమ కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉయ్యాలవాడ మండలంలోని హరివరం, నర్సిపల్లి గ్రామాలలో ఆయన పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. వర్షాలు కురవక పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చంద్రారెడ్డి, కార్తికేయ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, మండల నాయకులు రాఘవేంద్ర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పతనానికి నాంది పలుకుదాం---"రా కదలి రా"



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 05 తెలుగుదేశం పిలుస్తోంది రా కదలి రా అంటూ అన్న నందమూరి తారకరాముని పిలుపునకు యావత్ ఆంధ్రదేశం తన వెంట నడిచిందని ఇప్పుడు అదే నినాదంతోనే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్లేలా తెలుగుదేశం పార్టీ కార్యాచరణ రూపొందించిందని. మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ నంద్యాల ఇంచార్జ్ ఎన్.ఎమ్.డి ఫరూక్ పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈనెల 9వ తేదీన ఆళ్లగడ్డ పట్టణంలో జరిగే ఎన్నికల శంఖారావం సభ ఏర్పాట్లను ఫారూక్ తో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా ఇంచార్జ్ ప్రభాకర్ చౌదరి భూమా అఖిల ప్రియ. భూమా విఖ్యాత్ రెడ్డి.గౌరు వెంకట్ రెడ్డి. బుడ్డా రాజశేఖర్ రెడ్డి ధర్మవరం సుబారెడ్డి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అబ్జర్వర్ పోతుల రవి పరిశీలించారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరు కాబోతున్నారని కావున ప్రతి ఒక్కరు కదలి వచ్చిఅరాచకపాలనను అంతమొందించాలని వారు పిలుపునిచ్చారు.

## దినసరి కూలీలతో చెత్త సేకరణ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 05 – 15 వార్డు గోపాల్ నగర్ నందు దినసరి కూలీలతో చెత్త సేకరణ కార్యక్రమం ప్రారంభమైందని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ పేర్కొన్నారు . శుక్రవారం 15వార్డు కౌన్సిలర్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. వార్డు శానిటేషన్ సెక్రటరీ తో కలిసి శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు . అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నందున శానిటేషన్ పై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రైవేటు వర్కర్ల తో పనులుప్రారంభించామని తెలిపారు .గోపాల్ నగర్ నందు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి ఇంటికి సంబంధించిన చెత్తను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసినటువంటి ప్రైవేటు వర్కర్లకు అందజేస్తున్నారని ఆయన అన్నారు , మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినటువంటి సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారని అన్నారు .

## క్రిస్టియన్లను నిలువునా మోసం చేసిన జగన్ రెడ్డి

**టిడిపి జిల్లా కార్యదర్శి ఫిరోజ్**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 05 క్రిస్టియన్లను సీఎం వైఎస్ జగన్ రెడ్డి నిలువునా మోసం చేశారని టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆరోపించారు. నంద్యాల బొమ్మలసత్ర లోని అంబెడ్కర్ విగ్రహం ఎదుట ఏపీ టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు , ఉపాధ్యక్షుడు బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్ర రావు, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్, బుడగ జంగాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిడిపి 38వ వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు, యూత్ నాయకులు మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో క్రిస్టియన్లను నిలువునా మోసం చేసిన జగన్ రెడ్డి పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఆయనను ఇంటికి సాగానంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అధి కారం లో చేపట్టేలా చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేలా ప్రజలు ఓట్లు వేసి గెలివించాలని కోరారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190